చదువు

e-mail: edc@eenadu.in

# ఇదే మంచి సమయం!

విదేశాలకు వెళ్లి ఉన్నత విద్య అభ్యసించాలని ఆశపడే విద్యార్థులకు అమెరికా మొదటి గమ్యం. అయితే అక్కడ తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. ఇప్పుడు వెళ్లడం సరైనదా కాదా, అనుకున్న అవకాశాలు అందుకోగలమా లేదా.. ఇలా అనేక సందేహాలు విద్యార్థుల్లో మెదులుతున్నాయి. కానీ ఇదే మంచి సమయం, వెళ్లడమే మేలు అంటున్నారు నిపుణులు. అదెలా అంటే..



ట్రంప్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు తీసుకున్నాక.. ఇతర దేశాల నుంచి ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లే విద్యార్థుల పరిస్థితి ఎలా ఉండబోతోందో అని అందరూ అనుకున్నారు. వీసా నిబంధనలు, పార్ట్‌టైమ్ వర్క్స్ పనితీరు ఏమవుతుందో అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఊహించినట్టుగానే నిబంధనల అమలు తీరుల్లో మార్పులొచ్చాయి. అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఇదంతా కేవలం సరైన వీసా అనుమతులు, పత్రాలు లేని వారి విషయంలో మాత్రమే. అన్ని నిబంధనలు సక్రమంగా పాటించేవారు చక్కగా వెళ్లి చదువుకోవచ్చు.

» గత ఐదేళ్లుగా భారత్ నుంచి విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల సంఖ్యలో 50 శాతంపైగా పెరుగుదల నమోదవుతూ వచ్చింది. 2024లో దాదాపు 9 లక్షల మంది విద్యార్థులు వెళ్లినట్లు ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయి. వీరిలో అమెరికా వెళ్లేవారు అధికశాతం మంది ఉండగా.. ఆ తర్వాత కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్తున్నారు.

**1** **కోర్సు మీదే ధ్యాస:** గతంలో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి పార్ట్‌టైమ్ ఉద్యోగాల మీద ఆధారపడే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడలా లేదు. అయినప్పటికీ ఇది వారు వెళ్లి చదువుకునేందుకు మంచి సమయం. ఆందోళన అవసరమే లేదు. విద్యార్థులకు సంబంధించినంత వరకు ఇప్పటికే ఉన్న నిబంధనలు ఏవీ మారలేదు. కానీ అవి కఠినంగా అమలు కాబోతున్నాయి. అందుకే చదువుకుంటూ సంపాదన వైపు కాకుండా.. కోర్సు కాలవ్యవధిలో పూర్తిగా దాని మీదనే ధ్యాస పెట్టాలి.

**2** ఎఫ్1, హెచ్1, ఓపీటీ ఏ నిబంధనలూ మారలేదు. వెనక్కి తిరిగి పంపుతున్నది అక్రమ వలసదారులను మాత్రమే. దానికి సాధారణ విద్యార్థులతో సంబంధం లేదు. ఆ వార్తలు చూసి కంగారుపడాల్సిన పని లేదు.

» నిజానికి మొదటి నుంచి అమెరికాలో ఆఫ్‌క్యాంపస్‌లో విద్యార్థులు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయడంపై నిషేధం ఉంది. ఆన్ క్యాంపస్ కూడా అనుమతించిన గంటల మేరకే పనిచేయాలి. కానీ దీన్ని అధిక శాతం మంది పాటించడం లేదు. ఎక్కువ సంపాదన కోసం కోర్సు చేస్తూనే కష్టపడేవారు. ఇకపై ఇలాంటి వారి మీద గట్టి నిఘా ఉండబోతోంది. ఈ నిబంధనలు పాటించే తీరాలి.

**3** **అకడమిక్ శ్రద్ధ**

చదువుతూ ఉద్యోగం అన్న ఆలోచనకు కాస్త విరామం ఇచ్చి.. చదువుకునే సమయంలో పూర్తిగా అకడమిక్స్ మీదే శ్రద్ధ పెడితే.. ఒక్కసారి ఉద్యోగం వచ్చాక కావాల్సినంత సంపాదించుకోవచ్చు. ఇందుకోసం విద్యారుణాలను ఆశ్రయించవచ్చు. అలా కాకుండా ఒక పక్క ఫీజు కోసం పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ మరోపక్క చదువుకోవాలి అంటే మాత్రం అంత సులభం కాకపోవచ్చు. ఆర్థిక భరోసా కోసం స్కాలర్‌షిప్, ఇంటర్న్‌షిప్స్, అసిస్టెంట్‌షిప్స్ కోసం ప్రయత్నించవచ్చు.

**4** **ఎన్నో వర్సిటీలు**

అమెరికాలో 4 వేలకు పైగా యూనివర్సిటీలు వందల కోర్సులను అందిస్తున్నాయి. ఏవో కొన్నింటిలోనే సీట్ల కోసం ప్రయత్నించడం, పేరొందిన నగరాల్లో ఉండాలని కోరుకోవడం ద్వారా ఆర్థికంగా భారం ఎక్కువవుతుంది. దీనికోసం పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు ప్రయత్నిస్తే మొత్తానికే కష్టమవుతుంది. దాని బదులు చిన్న చిన్న పట్టణాల్లో ఉండే ఇతర వర్సిటీలను విద్యార్థులు ఎంచుకోవచ్చు. ఏడాదికి 10 వేల డాలర్ల ట్యూషన్ ఫీజుతో చదువు చెప్పేవీ ఉన్నాయి. ఇటువంటి వాటిలో ప్రయత్నించవచ్చు. ఇదే సమయంలో మరీ చిన్నాచితకా కాలేజీలు కాకుండా కాస్త పేరున్నవాటినే ఎంచుకోవాలి. సీపీటీ కాలేజీలను పరిగణనలోకి తీసుకోవద్దు. పరిశోధన చేసి మంచి వాటికే ప్రాధాన్యం ఇవ్వాలి.

**5** **మిగతా దేశాల్లో..**

నిజానికి మిగతా దేశాల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయడాన్ని స్థానిక ప్రభుత్వాలు అనుమతిస్తున్నాయి. అమెరికాలో మాదిరిగా సమస్య లేదు. కానీ అక్కడ కూడా విద్యార్థులు వారికి అనుమతించిన గంటల కంటే అధికంగా జాబ్స్ చేస్తున్నారు. ఇలాంటి వారి మీద అక్కడా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. పూర్తిగా లీగల్‌గా నడుచుకోవడం ద్వారా పాక్షికమైన సంపాదన కాకుండా సుస్థిరమైన కెరియర్ సొంతం చేసుకోవచ్చు.

**6** **ఎందుకు వెళ్లాలి?:** అమెరికాలో ప్రభుత్వం మారాక 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే నినాదంతో ముందుకువెళ్తున్నారు. దీని ద్వారా కొత్త ఉద్యోగాలు ఎన్నో రాబోతున్నాయి. అదే సమయంలో అక్రమ వలసదారుల సమస్యనూ తగ్గిస్తున్నారు. దీని ద్వారా సక్రమంగా ఆ దేశంలో చదువుకుని ఉద్యోగాలు చేయాలి అనుకునే యువత ఆ అవకాశాలన్నీ అందుకునే వీలుంటుంది. ఇప్పుడు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి పీజీలో చేరేవారు సరిగ్గా ఈ విధానాలన్నీ అమలై కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చేనాటికి జాబ్ మార్కెట్‌లోకి వచ్చేస్తారు. అందువల్ల విద్యార్థులకు ఇది ఒక రకంగా సువర్ణావకాశం. చేయాల్సినదల్లా చదువుకుంటూ ఉద్యోగాలు అన్న ఆలోచన మర్చిపోయి పూర్తిగా కోర్సు మీద ధ్యాస పెట్టడమే.



– శుభకర్ అలపాటి
డైరెక్టర్, గ్లోబల్ ట్రీ.

సీఎస్ఐఆర్-ఎన్ఐఓలో సైంటిస్టులు